# తొలి పలుకు

# క్రీస్తు తన సంఘాన్ని ఎలా స్థాపించాడు?

క్రీస్తు ప్రభువు యొక్క భౌతిక జీవిత కాలానికి ఉన్న విలక్షణత్వమేమంటే, దాదాపు ఆయన దేనిని సంపాదించ దలచుకోలేదు. ఆయన యిల్లు కట్టినట్టుగాని, ఏ రకపు కట్టడాన్నైనా రీ మోడల్ చేసినట్టుగాని, లేక స్థలాన్ని కొన్నట్టుగాని క్రొత్త నిబంధనలో మనం ఎన్నడు చదువం. బట్టలు, పనిముట్లు కనీసం భోజనం – ఆయన ఏదీ కొన్నట్టు సువార్త రచనలు ఎన్నడు సూచించలేదు. ఆయన ఈ లోకంలో ఉన్నప్పుడు, అంటే, ఆయన ఒక పౌరుడుగా ఉన్నప్పుడు, ఆయన ఎన్నడు లోక సంబంధిగా ఉండలేదు. ఆయన ఈ లోకంలో ఉన్నాడు, కాని లోకం ఎన్నడు ఆయనతో లేదు; ఆయన లోకంలో ఒక భాగంగా జీవించాడు, కాని దానిని ఎన్నడు తనలో జీవించడానికి ఆయన అనుమతించ లేదు. ఆయన ఇక్కడ నివసిస్తూనే, పరాయి దేశంలో పరదేశిగాను, తన మమకారాలు, జీవితం మరొక లోకంలో నిమగ్నమైన యాత్రికుడుగాను జీవించాడు.

"నా" "నాది" అనే స్వంతాన్ని సూచించే మాటలు క్రీస్తు ప్రభువు అరుదుగా ఉపయోగించాడు. "నా శిష్యులైయుండి" (యోహాను 8:31), "నా తండ్రి" (మత్తయి 26:39), "నా శరీరము" (మత్తయి 26:26), "నా రక్తము" (మత్తయి 26:28), "నా మాటలు" (లూకా 6:47), మరియు "నా సంఘము" (మత్తయి 16:18) అని ఆయన పలికాడు. "నా శరీరము," "నా రక్తము" అనే మాటలు సహితము ఆత్మసంబంధమైన సందర్భంలోనే సూచించాడు కాని కేవలం వ్యక్తిగతమైన కోర్కెలతో కాదు అనేది విదితం.

సువార్త రచనల ప్రకారం, తన భూసంబంధమైన పరిచర్యకు, తన వెనుక శాశ్వతంగా విడిచి వెళ్లే తన సొత్తు ఒక్కటే ఉంది, సంఘం – అది ఒక కళాశాల కాదు, భౌతికమైన యిల్లుగాని, ఆస్తిగాని కాదు (మత్తయి 16:18). దేవుని రాజ్యాన్ని ప్రకటించడంతో ఆయన తన పరిచర్యను ఆరంభించాడు (మత్తయి 4:17), మరియు దేవుని రాజ్యాన్ని ప్రకటించడంతోనే దాన్ని ముగించాడు (అపొ. 1:3). ఆయన స్థాపించే సంఘము దేవుని రాజ్యము యొక్క భూసంబంధమైన రూపమని ఆయన సూచించాడు; ఈ విధంగా, ఈ భావంలో, తన సంఘాన్ని దేవుని రాజ్యానికి సమీకరించి సూచించాడు (మత్తయి 16:16–18).

తనకు స్వంతంగా ఉండాలని క్రీస్తు ప్రభువు కోరింది సంఘం అనేది ఒక్కటే

అయ్యున్నందున, ఆయన తన వెనుక విడిచి వెళ్లిన సొత్తు ఆ ఒక్కటే అయ్యున్నందున, ఆ ఒక్కటే ఆయనకు ప్రాముఖ్యమని తెలుస్తుంది గనుక మనకు కూడా ఆ ఒక్కటే ప్రాముఖ్యమై ఉండాలి. మనం ఆ సంఘంగా మారి, ఆ సంఘంగా జీవించాలనేది బలీయమైన కోర్కెయై ఉండాలి.

దీని వెలుగులో, ఒక ప్రశ్న మనకందరికి ప్రధానమైనదిగా ఉండాలి: "మనం సంఘంలో ఎలా ప్రవేశించాలి ఎలా సంఘంగా జీవించాలి?" ఆరంభంలో క్రీస్తు ప్రభువు తన సంఘాన్ని ఎలా స్థాపించాడో కనుగొనడంవలన ఈ ప్రశ్నకు జవాబు లభిస్తుంది. ప్రభువు తన సంఘాన్ని ఎలా స్థాపించాడో వాస్తవంగా మనం చూచినప్పుడు, అది ఎక్కడ లేదో అక్కడ దానిని స్థాపించడానికి ఒప్పుకుంటాం, మనం ఎక్కడ ఉన్నా, అక్కడ దానిలో నమ్మకమైన సభ్యులుగా ఉండాలని గుర్తిస్తాం.

తాను చేసిన వాగ్దానము ననుసరించి క్రీస్తు ప్రభువు, తన పునరుత్థానం తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన ఆయన తన సంఘాన్ని స్థాపించాడు (మత్తయి 16:18; అపొ. 2). ఆయన దాన్ని ఎలా చేశాడు?

## అదే సువార్త ప్రకటనవలన

ప్రభువైన యేసు తన సంఘాన్ని స్థాపించడానికి చేసిన తొలి ఏర్పాటు సువార్తను ప్రకటించడం. "శుభ వార్త" "మంచి వార్త" పెంతెకొస్తు దినాన గుమికూడియున్న యూదులకు బహిరంగంగా దేవుని కృపవలన రక్షణ అనే సందేశం ప్రకటింపబడింది. చారిత్రాత్మకమైన ఈ దినం అపొస్తలులపై పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడంతో ఆరంభమయ్యింది. అలాటి కుమ్మరింపును క్రీస్తు ప్రభువు వాగ్దానం చేశాడు, యిప్పుడు ఆ వాగ్దానం నెరవేర్చబడింది (అపొ. 1:4, 5; 2:1–4). తత్ ఫలితంగా, అపొస్తలులు, పరిశుద్ధాత్మ బాప్తిస్మమువలన శక్తినొందినవారై, ఆ స్థలంలో కూడి వచ్చినవారి ప్రాంతీయ భాషలలో ఆశ్చర్యకరమైన దేవుని మాటలను పలికారు (అపొ. 2:6–8, 11). అప్పుడు ప్రభువు అతనికి చేసిన వాగ్దానంలో పాక్షికమైన నెరవేర్పుగా (మత్తయి 16:19), క్రీస్తుయొక్క దైవత్వాన్ని గూర్చి పేతురు వివరమైన ప్రసంగాన్ని చేశాడు (అపొ. 2:14–36, 40).

తన ప్రసంగానికి పరిచయంగా, ఆ దినమున సంభవిస్తున్నది యోవేలు ప్రవచనపు నెరవేర్పు యొక్క ప్రధాన ఘట్టమైయున్నట్టు పేతురు ఆ జన సమూహానికి సూచించాడు (అపొ. 2:15–21). అతని ప్రసంగంయొక్క ప్రధాన భాగంలో ఆయన అద్భుతముల ద్వారా (అపొ. 2:22), పునరుత్థానమువలనను (అపొ. 2:24), ప్రవచనం నెరవేర్చడం వలనను (అపొ. 2:25–31; 34, 35), సాక్ష్యము (అపొ. 2:33), మరియు పరిశుద్ధాత్మ దిగివచ్చుటవలనను క్రీస్తు ఎలా ప్రభువుగాను, క్రీస్తుగాను నిరూపింపబడ్డాడో ప్రధానంగా సూచింపబడింది. తీర్మానంతో కూడిన ముగింపుతో పేతురు తన ప్రసంగాన్ని యిలా ముగించాడు, "మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (అపొ. 2:36).

పెంతెకొస్తు దినాన, లోకం దృష్టి రోమా సామ్రాజ్యపు కార్యకలాపాలమీద నిలిచి ఉండవచ్చుగాని పరలోకపు దృష్టిలో మాత్రం లోకంలో అతి ప్రాముఖ్యమైన సంఘటన యెరూషలేములో జరుగుతుంది. తొలిసారిగా సువార్త వినిపింపబడుతుంది! దేవుని సంకల్పమంతా, పాత నిబంధన కాలపు ప్రవచనాలన్నీ, క్రీస్తు భూనివాస కాలపు సిద్ధపాటు, ఆయన పరిచర్య అంతా కేంద్రీకృతమై, కలిసిపోయి, దేవుని కృపా సువార్త ప్రకటింపబడేలా రూపొందింది. క్రొత్త నిబంధన అమలులో పెట్టబడింది, దాని నెరవేర్పు వాస్తవ రూపం దాల్చింది.

అపవాదిని వాని రాయబారులను భయంతో వణికించేలా, పరలోకాన్ని ఆనందంలో ముంచివేసేలా ఈ సందేశం ప్రకటింపబడడం జరిగి ఉండవచ్చు. తన ఈ సువార్తను ప్రకటించడం ద్వారా క్రీస్తు ప్రభువు తన సంఘాన్ని ఉనికిలోనికి తెచ్చాడు; ఆ సమయం మొదలుకొని, లోకంలోని యితర స్థలాల్లో అదే సందేశాన్ని ప్రకటించడంవలన ఆయన సంఘం స్థాపింపబడుతుంది.

ఈ క్రింది దృశ్యాన్ని ఊహించడం ద్వారా సువార్త ప్రకటన ప్రాముఖ్యతను గూర్చి ఆలోచించు. తీర్పు దినాన సంపూర్ణంగా మతం లేని ఒక మనిషి దేవుని సింహాసనం ఎదుట నిలిచాడు. అతడెన్నడు దేవుని చిత్తమేదో తెలిసికొన ప్రయత్నించలేదు, ఎన్నడు దేవుని ఆరాధించలేదు, క్రైస్తవ జీవితాన్ని జీవించడానికి ఎన్నడు యత్నించలేదు. దేవుని పట్ల తనకు ఏలాటి బాధ్యత లేనట్టు, తన పని తాను చేసికొన్నాడు, ఉల్లాసాల్లో గడిపాడు, తన కుటుంబాన్ని పెంచుకున్నాడు, తాను జీవించిన సమాజంతో కాలాన్ని వెల్లబుచ్చాడు. అతడు తీర్పు సింహాసనం ఎదుట నిలువబడి యుండగా, “నీ జీవిత కాలంలో ఒక్కసారి నా పనిలో నీవు నిజంగా వ్యత్యాసాన్ని కనుపరచావు” అని ప్రభువు అతనితో అన్నాడట. ఆ మనిషి పూర్ణంగా ఆశ్చర్యపోయి, “ప్రభువా, నా జీవితకాలంలో నేను ఎన్నడు మతస్థుడుగా ఉండలేదు. నా జీవిత కాలమంతటిలో ఏవో కొన్నిసార్లు ఆరాధనా స్థలాలకు వెళ్లానుగాని నేనెన్నడు దేవుని ఆరాధించలేదు. నా జీవితం స్వార్థపరమైనదిగానే ఉండి పోయింది, నా సొంత ఏర్పాట్లకు ఉద్దేశాలకే అది అర్పించబడింది. భూమిమీద నేనెన్నడు ఎరిగి నీ కొరకు ఒక్క కార్యమైనా జరిగించలేదు. నీ పనిలో నేను అలాటి వ్యత్యాసాన్ని ఎప్పుడు కలిగించాను?” అని అతడు బదులిచ్చాడట.

ఆ మనిషితో ప్రభువు యిలా అన్నాడట, “నీవు జీవించిన బస్తీలో మెయిన్ రోడ్లు కలయిక మూలలో నీకు ఒక చిన్న షాపు ఉండేది. ఒక రోజును ఒక మనిషి ఆగి, ‘ఈ టౌన్లో క్రీస్తు సంఘం కూడేది ఎక్కడో చెప్పగలవా?’ అని నిన్ను అడిగితే, దీనికి సమీపంగానే వారు కూడతారు అని సంఘం కూడుకునే స్థలానికి నీవు దారి చూపావు. ఆ మనిషి నా సువార్తికుడు. నా కృపా సువార్తను ప్రకటించడానికి అతడు సమయానికి అక్కడికి వచ్చి చేరుకున్నాడు, విని దానికి ప్రత్యుత్తరమిచ్చిన వారిద్వారా నా రక్షణ కార్యాన్ని జరిగించుకున్నాను. అది నీకు అప్పటిలో తెలియదు. ఈ లోకంలో జరిగిన మహా గొప్ప పనికి నీవొక చిన్న కనెక్టింగ్ లింక్‌గా పని చేశావు. వాషింగ్టన్ డి.సి లోనో, లేక మరొక దేశ రాజధాని నగరుల్లోనో జరిగేది ప్రాముఖ్యమయ్యిందని లోకం అనుకుంది. రక్షణ సువార్త ప్రకటింపబడే చిన్న చర్చ్ బిల్డింగ్‌లో జరిగేది ముఖ్యమైనది. నా సువార్తికుడు ఒక జనుల కూడికలో సువార్త ప్రకటించేలా నీవు అతనికి చూపిన దారి సహాయపడింది.

నీవు చేసిన వాటిలో అది అతి గొప్పది."

పౌలు యిలా వ్రాశాడు, "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవుని ఎరుగ కుండినందున, సువార్త ప్రకటన అను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" (1 కొరింథీ. 1:21). అపో. 2లో పేతురు యొక్క ప్రసంగం క్రీస్తు ప్రభువు యొక్క చివరి వీలునామా మరియు నిబంధన అమలులోనికి తేబడి, క్రైస్తవ యుగం ఆరంభింపబడింది. అపో. 2ను "బైబిలు యొక్క యిరుసు" అని డా. జేమ్స్ డి. బేల్స్ పిలిచాడు; దానికి ముందున్నదంతా దాని వైపు ముందుకు చూచింది, అపో. 2 తరువాత వచ్చిందంతా వెనుకకు దాని తట్టు చూచింది. ప్రశ్న లేకుండా, అతడు చెప్పింది కరక్టే.

సంఘం యొక్క ఆరంభం సువార్త ప్రకటన చుట్టు తిరుగుతుంది. పెంతెకొస్తు దినాన ఆరంభింపబడిన సంఘం అది లేని స్థలాల్లో పేతురు ప్రకటించిన సువార్తను ప్రకటించడం ద్వారానే ప్రారంభించబడుతుంది. ఇంకో విధంగా దాన్ని చెప్పాలంటే, ఒక కర్షకుడు పండించిన టమోటాలను మరొక కర్షకుడు పండించాలంటే, మొదటి కర్షకుడు వేసిన విత్తనాలనే రెండవవాడు కూడా వేయాలి. క్రీస్తు నిర్మించిన అదే సంఘం రావాలంటే, ఆరంభంలో క్రీస్తు ప్రభువు దేనిచేత దాన్ని నిర్మించాడో అదే సువార్తను మనం ప్రకటించవలసి ఉంటుంది.

## అదే సువార్తకు విధేయులగుటవలన

తన సంఘాన్ని స్థాపించడంలో ప్రభువైన యేసు యొక్క ప్లానులో రెండవ మెట్టు సువార్తకు లోబడడం. ప్రకటింపబడిన సువార్తకు అక్కడ హాజరైన జనులు లోబడక యుండినట్లయితే, ఆయన సంఘము స్థాపింపబడేదికాదు.

యథార్థమైన హృదయాలన్నీ పేతురు ప్రసంగం యొక్క రుజువు అంగీకరించేలా ప్రత్యేకమైన ముగింపుకు చేరుకుంది: అది యేసు ప్రభువుగాను క్రీస్తుగాను నియమింప బడ్డాడనేది (అపో. 2:36). అప్పుడు శ్రోతల గుంపు "మేమేమి చేతుము?" అని అడిగారు (అపో. 2:37). వారి హృదయాలు దేవుని వాక్యముచే పొడవబడ్డాయి లేక విరగగొట్ట బడ్డాయి; వాక్య ప్రకటన ద్వారా వారు పరిశుద్ధాత్మవలన ఒప్పింపబడ్డారు. తన ప్రసంగం యొక్క తీరువలన వారు దోషులైనట్టు పేతురు సృష్టించలేదు; వాక్యాన్ని బయలుపరచడం వలన అతడు దానిని ప్రదర్శించాడు, ప్రాణాత్మలను కీళ్లను మూలుగులను విభజించునంత మట్టుకు దూరుచు హృదయంయొక్క తలంపులను ఆలోచనలను ఆ వాక్యం శోధించింది (హెబ్రీ. 4:12).

గుచ్చబడిన మనస్సాక్షులు, విరిగిన హృదయాలతో బిగ్గరగా అడిగిన యూదులకు పేతురు యొక్క బదులు: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపో. 2:38). తన అపొస్తలులకు ప్రభువు యిచ్చిన కడసారి ఆజ్ఞలో రక్షణకు: విశ్వాసము, మారుమనస్సు, బాప్తిస్మము అనే మూడు షరత్తులను ఆయన

పేర్కొన్నాడు (మార్కు 16:15, 16; లూకా 24:46, 47; మత్తయి 28:19, 20). వారి ప్రశ్నకు యిచ్చిన జవాబులో పేతురు విశ్వాసాన్ని ప్రస్తావించలేదు, ఎందుకంటే వారు వినిన ప్రసంగం మూలంగా విశ్వాసం ఉద్భవించినట్టు నడిపింపు కొరకు వారు వేసిన కేకయే సూచించింది. వారు ఎదుర్కోవలసిన రెండు షరత్తులను అతడు ప్రత్యేకంగా సూచించాడు: మారుమనస్సు బాప్తిస్మం అనేవి. ఈ ఆజ్ఞలకు వారు లోబడినప్పుడు క్రీస్తు ప్రభువు రక్తంవలన వారు వాంఛించి విలపించిన పాపక్షమాపణ లభిస్తుంది. అప్పుడు, రక్షింపబడిన జనులుగా, పరిశుద్ధాత్మయను పరలోకపు వరము వారికి ప్రసాదింప బడుతుంది.

లూకా యిలా దాఖలు చేశాడు, “కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి” (అపో. 2:41). సంఘ పునాదిలో భాగంగా అపొస్తలులు ఉంచబడ్డారు (ఎఫెసీ. 2:20). సువార్తకు ఈ మూడు వేలమంది తమ విధేయతను సంపూర్తి చేయగా, యేసు క్రీస్తు, అపొస్తలుల పునాది మీద వారు పరిశుద్ధాత్మచేత నిలుపబడి అతికింపబడ్డారు (1 కొరింథీ. 3:11). ఈ విధంగా, సంఘం జన్మించి, ఉనికిలోనికి తేబడింది. ఆనాటినుండి నేటివరకు, ఆ మూడువేలమంది లోబడిన సువార్తకు ఎప్పుడైనా ఎవరైనా లోబడినప్పుడు, అతడు అదే సంఘానికి చేర్చబడతాడు, ప్రభువు యొక్కయు ఆయన అపొస్తలులయొక్కయు పునాది మీద నిలిచియున్న సంఘము యొక్క పై నిర్మాణము ఎత్తుగా పెదుగుతోంది.

1993 మేలో,Ukraineలోని Donetskలో క్రీస్తు కొరకు ఇరవైయయిదుమంది క్రైస్తవులు ఒక క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. మా ఉద్దేశమేమంటే, ఆ పట్టణంలో ప్రభువు యొక్క సంఘాన్ని స్థాపించాలని. వ్యక్తిగతమైన ఉపదేశం, టెలివిజన్ ప్రీచింగ్, రాత్రులందు లెక్చర్ హాల్ ప్రీచింగ్‌ను మిశ్రమం చేశాం. పేతురు పెంతెకొస్తు దినాన ఏ సువార్త ప్రకటించాడో మా ఉపదేశంలోగాని, ప్రసంగాల్లోగాని అదే సువార్తను ప్రకటించాం. పేతురువలెనే – విశ్వాసము, మారుమనస్సు మరియు బాప్తిస్మము అనేవాటివలన జనులు క్రైస్తవులుగా మరాలని చెప్పాం. పది దినాల క్యాంపెయిన్‌లో, 122 మంది క్రైస్తవులై యుండడానికి తమ కోర్కెను కనుపరచారు. బాప్తిస్మం పొందవచ్చిన ప్రతివారితో మేము నొక్కి చెప్పిందేమంటే – వారు మతశాఖలో ప్రవేశించడం లేదని క్రీస్తు సువార్తకు యథార్థమైన వారి విధేయతవలన, పెంతెకొస్తు దినాన ఆయన స్థాపించిన తన సంఘానికి ఆయనచే వారు చేర్చబడుతున్నారని.

ఒక థియేటర్‌లోని రెండవ అంతస్థును ఈ నూతనమైన సంఘము కూడడానికి అద్దెకు తీసికొంది. ప్రభువు దినాన మేము వారితోకూడా ఉన్నాం. అద్దెకు తీసికొన్న ఆ గది నిండి యింకా జనులు బయట ఉన్నారు. ప్రభురాత్రి భోజనంలో పాలుపొందేటప్పుడు క్రీస్తు ప్రభువు మరణం ద్వారా యివ్వబడిన మా రక్షణయందు కలిసి ఆనందించాం, కలిసి పాటలుపాడాం, కలిసి ప్రార్థించాం, మా సమృద్ధిలోనుండి కానుకలు సమర్పించాం, సువార్త ప్రకటనను విన్నాం.

పది కొద్ది దినాల్లో, Donetskలో సువార్త ప్రకటన ద్వారాను సువార్తకు లోబడుటద్వారాను యథార్థ హృదయంగల జనులను దేవుని రాజ్యంలోనికి తెచ్చుటద్వారా

సంఘం స్థాపింపబడింది. అపొ. 2లో దాఖలు చేయబడినట్టు పెంతెకొస్తు దినాన మన ప్రియ ప్రభువు స్థాపించిన సంఘానికి 122 మంది చేర్చబడ్డారు.

ప్రసంగించడం, ఉపదేశించడం, మరియు కూటాలతో మేము క్యాంపెయిన్ జరిగించినా, ఎవరూ సువార్తకు లోబడలేదనుకో, Donetskలో సంఘం స్థాపించబడి యుండేదా? జవాబు తెలిసిందే, కదా? అది స్థాపింపబడియుండేదికాదు. సదుద్దేశాలతో, విస్తరించిన ఏర్పాట్లతో, వ్యక్తిగతమైన సమర్పణతో, క్రొత్త నిబంధన సువార్తకు జనులు లోబడకుండ సంఘము ఉండనేరదు.

తన సువార్తకు మూడువేల మంది లోబడినప్పుడు క్రీస్తు ప్రభువు తన సంఘాన్ని స్థాపించాడు. పేతురు ప్రకటించిన సువార్తను ప్రకటించుటద్వారాను, జనులు ఆ సువార్తకు లోబడుటద్వారాను నేడు ఆయన సంఘం ఎక్కడ లేదో అక్కడ అది స్థాపింపబడవచ్చు, క్రీస్తు ప్రభువు ఆరంభంలోనే తన సంఘాన్ని యిలా స్థాపించాడు, నేడు అది స్థాపింపబడ డానికి అది ఒక్కటే మార్గం.

## అదే సువార్తను జీవితంలో అనుసరించుటవలన

అదే సంఘాన్ని స్థాపించడమందు ప్రభువు ఏర్పాటులో మూడవ మెట్టు అదే సువార్తను జీవితంలో అనుసరించడం అని చెప్పవచ్చు. సువార్తకు లోబడిన జనులు దానితో అనుదినం జీవించారు: అలాగున, క్రీస్తు ప్రభువు సంఘం జీవితంలో స్పందించ బడుతుంది.

క్రైస్తవులైనవారిని గూర్చి లూకా యిలా అన్నాడు, "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టెవిరచుటయందును, ప్రార్థనచేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొ. 2:42). వారు క్రీస్తు ప్రభువు సంఘమై ఉండడంమాత్రమే గాక, ఆ దినం మొదలుకొని వారు క్రీస్తు సంఘంగానే జీవించారు.

సువార్త ప్రకారం జీవించాలంటే సమర్పణ అవసరమని ఆది క్రైస్తవుల జీవితాలు ఉదహరిస్తాయి. వారు అపొస్తలుల బోధకు, సహవాసానికి, రొట్టె విరవడానికి, ప్రార్థించ డానికి తమ్మును తాము అప్పగించుకొన్నారు. వారు ప్రారంభించి త్వరలోనే వదలిపెట్టలేదు; వారు ఆరంభించి, దేవుని సత్యానికి స్థిరంగా సమర్పించుకున్నారు. వారు దేవుని క్రమంగా ఆరాధించారు; ఆరాధన వారికి జీవిత విధానంగా మారిపోయింది. క్రైస్తవుడుగా మారడమంటే, క్రొత్త మార్గాన తిరిగి, తన జీవితంలో మిగిలిన భాగమంతా అందులో నడుచుకొంటూ పోవడమే.

సువార్త ప్రకారం జీవించడంలో కనికరం కలిగియుండాలి. లూకా యిలా చెప్పాడు, "ఇదియుగాక వారు తమ చరస్థిరాస్తులను అమ్మి, అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి." (అపొ. 2:45). "నీవు నాకు సహాయం చేస్తావా?" అని వారు యితరులను అడుగలేదు. కాని, వారిలో అవసరతలో ఉన్నవారిని చూచి, "నేను నీకు సహాయం చేయవచ్చా?" అని అడిగారు. దయగల ప్రభువు వారియందు నివసించాడు, ఆ దయను వారు ఉద్దేశాల్లోను, క్రియల్లోను ప్రదర్శించారు.

ఆది క్రైస్తవులు దాని ఐక్యతను కాపాడడంవలన సువార్తననుసరించి జీవించారు. లూకా యిలా తెలిపాడు, "విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమష్టిగా ఉంచుకొనిరి" (అపో. 2:44). "విశ్వసించిన వారందరు ఏక హృదయమును ఏకాత్మయుగలవారై యుండిరి ..." అని అతడు యింకను అన్నాడు (అపో. 4:32). వారు సువార్తకు లోబడినప్పుడు, దేవుని ఆత్మచేత ఆత్మసంబంధమైన ఏకత్వంచేత అతుకబడ్డారు, ఆత్మ సందేశానికి వారు నమ్మకస్థులై ఉండడంవలనను, యథార్థమైన స్వార్థ రాహిత్యంతో, ఒకరియెడల ఒకరు నిజమైన అక్కర కలిగియుండడం వలనను వారు కాపాడుకొంటున్నారు.

జనులు సువార్తను ఆలకించి, దాని ప్రకారం జీవించడానికి యిష్టపడే ఏ స్థలంలోనైనా క్రీస్తు సంఘం ఉంటుంది. చాలా సంవత్సరాల క్రితం నేను హార్డింగ్ కాలేజికి వెళ్లినప్పుడు, అర్కన్‌సాస్ స్ప్రింగ్ ఫీల్డ్‌కు కారులో వెళ్లి ప్రసంగించేవాడిని, అక్కడ సంఘం చిన్నది, కాని సంఖ్యలో దానికి ఏ లోపముందో ఆత్మలో దాన్ని పూరించుకొంది. ఆ సంఘము పన్నెండు మంది స్త్రీలతో కూడియుంది. స్థానిక సంఘంలో పురుషులెవ్వరు లేకపోయినందున, స్త్రీలే ఆ పనిని కొనసాగించవలసినవారైయున్నారు. నా రూమ్‌మేట్ టెరీసీమన్ నాతో వచ్చేవాడు, అతడు కార్యక్రమమంతా నడిపించేవాడు. నేను ప్రసంగించగా, టెర్రీ పాటలు నడిపించేవాడు, ప్రార్థన చేసేవాడు, ప్రభురాత్రి భోజనాన్ని అందించేవాడు. టెర్రీ ప్రసంగించి నప్పుడు, మిగిలిన కార్యాలను నేను చేసేవాడను.

ఈ స్త్రీలు క్లిష్టమైన పరిస్థితిలో ఉండిపోయారు. వారికి సహాయపడడానికి ఒక్కడూ లేడు, అయితే వారు క్రీస్తు ప్రభువు సంఘంగా నమ్మకంగానే కొనసాగారు. వారికి సువార్తికుడు లేనందున, బుధవారం రాత్రులయందు, వారు పాడి, ప్రార్థించి, క్రైస్తవ స్త్రీలు కూటమిగా బైబిలు పఠించేవారు. వారి పరిస్థితులు ఆదర్శమైనవి కానప్పటికి, సువార్త ప్రకారం వారు జీవించడంలో కొనసాగారు.

ఆర్కన్‌సాస్‌లోని స్ప్రింగ్ ఫీల్డ్‌ను నీవు ఎప్పుడైనా సందర్శించడం జరిగితే, క్రీస్తు సంఘం యింకా తన పనిని కొనసాగించుతున్నట్టు నీవు కనుగొనగలవు. సంఘం బలీయంగాను చురుకుగాను ఉన్నట్టు నీకు కన్పిస్తుంది. అది చాలా పెద్దదేమీకాదు, అది నమ్మకమైనదిగాను స్థిరమైనదిగాను ఉంది. క్లిష్టమైన పరిస్థితుల్లో సహా, నమ్మకంగా జీవించిన ఆ స్త్రీలు లేకున్నట్టయితే స్ప్రింగ్ ఫీల్డ్‌లో సంఘం ఉండియుండేది కాదు. ఒక సమాజంలో సంఘం సజీవంగా ఉండడానికి ఎంత ప్రయాస అవసరమో వారికి తెలుసు.

పలువురు బాప్తిస్మం పొందిన శిబిరాలను గూర్చి మనం వింటూ ఉంటాం. దేవుని ఆత్మవలన వారు దేవుని రాజ్యంలోనికి జన్మించారు, క్రీస్తు సంఘం కూడ ఆరంభించింది. ఆ స్థలంలో సంఘం ఆరంభమైనట్టు కన్పించింది. శిబిరాలు ముగిసి, క్యాంపెయినర్స్ యింటికి వెళ్లేసరికి, క్రొత్తగా క్రైస్తవులైనవారు నిరుత్సాహపరచబడ్డారు. త్వరలో ఆరాధనా కార్యక్రమాలకు వారి హాజరు పడిపోయింది, చివరిగా, సంఘపు కూడికే ఆగిపోయింది. సువార్త ప్రకారం జీవించడానికి ప్రతి ఒక్కరు మానివేశారు, ఆ స్థలంలో సంఘం యొక్క ఉనికి అంతరించిపోయింది. సువార్త ప్రకారం ఎక్కడ జీవితాలు కొనసాగలేదో అక్కడ సంఘం సజీవంగా ఉండలేదు.

సువార్త ప్రకారం జీవించే ప్రజలతో క్రీస్తు ప్రభువు తన సంఘాన్ని పెంతెకొస్తుదినాన స్థాపించాడు, అది ఎక్కడ లేదో అక్కడ నేడు ఆయన సంఘాన్ని స్థాపింపవచ్చు. ఈ నియమానికి మినహాయింపులు లేవు. మన సమాజంలో సంఘం ఉండాలంటే, మనం సువార్తకు లోబడి దాని ప్రకారం జీవించాలి.

## ముగింపు

అప్పుడు, క్రీస్తు తన సంఘాన్ని ఎలా స్థాపించాడు? సువార్త ప్రకటింపబడి, విధేయత చూపబడి దాని ప్రకారం జీవించడంవలన ఆయన దాన్ని స్థాపించాడు. మనకు దాని వర్తింపు విదితమే: నేడు సంఘం అదే విధంగా స్థాపింపబడుతుంది. ఎక్కడ అదే సువార్త ప్రకటింపబడి, అదే సువార్తకు విధేయత చూపబడి, అదే సువార్త ప్రకారం జీవించ బడుతుందో, పెంతెకొస్తు దినాన స్థాపింపబడిన అదే సంఘం స్థాపింపబడినదై ఉంటుంది.

క్రొత్త నిబంధన సువార్తకులోబడు, అనుదినం దాని ప్రకారం జీవించు, నీవు క్రీస్తు సంఘమైయుంటావు.

వివాహం మీద ప్రసంగిస్తున్న ఒక సువార్తికుని గూర్చి ఒక కథ చెప్పబడింది. "మీకు దేవుని సంకల్పం తెలుసు: కేవలం ఒక పురుషుడు ఒక స్త్రీకి, కేవలం ఒక స్త్రీ ఒక పురుషునికి. ఇది ఆయన ఏర్పాటు. దాన్ని నీవు మెరుగుపరచలేవు" అని దాదాపు ఒక గంటసేపు మరల మరల ఆ విషయాన్ని వివరించాడు. కార్యక్రమం ముగిసింది, వచ్చిన ప్రతి ఆరాధకునికి గుమ్మం వద్ద నిలబడి వందనాలు చెప్తూ, పెండ్లికాని యిద్దరు యువతులను అతడు కలిసాడు. పెండ్లి జరుగబోయే అవకాశం ఈ యువతులకు సమీపించింది. "సువార్తికుడా, దాన్ని మేము మెరుగుపరచ కోరడం లేదు. మేము కేవలం దానిలో నిలవాలనుకుంటున్నాం" అని వారన్నారట.

క్రీస్తు సంఘాన్ని గూర్చి నీ సెంటిమెంట్స్ అలాటివి కావా? నీవు దాన్ని వృద్ధిచేయలేవు. నిన్ను నీవు ఎరిగిన దానికంటె ఆయన నిన్ను గూర్చి శ్రేష్ఠంగా ఎరుగును. ఆయన తన సంఘాన్ని నీ అవసరతలకొరకు డిజైన్ చేశాడు. క్రీస్తు సంఘమందు జరిగే ఏ మార్పయినా, దైవికమైన కాపుదలనుండి దాన్ని తొలగించి, మానవ దోషంచేత దాన్ని నింపుతోంది.

క్రీస్తును ఆయన ఉన్న రీతిగానే అంగీకరించు మరియు, ఆయన సువార్తకు లోబడి, దాని ప్రకారం జీవించడం ద్వారా, ఆయన నిర్మించిన సంఘంగానే నిలిచియుండు.